క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా ట్రెజరర్‌గా శ్రీనివాసరెడ్డి



పెదకాకాని: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ట్రెజరర్‌గా వెనిగండ్లకు చెందిన కొండ మడుగుల శ్రీనివాసరెడ్డి నియమితులైనట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పార్టీ కమిటీని నియమించారు. శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. వెనిగండ్ల గ్రామ సర్పంచిగా పలు అభివృద్ధి పనులు చేసి, ప్రజల మన్ననలు పొందారు. దీనిపై శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో నగర శివారులోని శివారెడ్డిపాలెంలోని పోలేరమ్మ దేవస్థానం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ దేశీయ వైద్య సంఘం గుంటూరు శాఖ అధ్యక్షుడు నామాల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులతో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ



పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయ ప్రాకార మండపంలో రెండవ శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభించారు. భక్తులే స్వయంగా దీపాలు వెలిగించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అలంకరించి, ప్రదక్షిణలు చేపట్టారు. ఆలయంలో ప్రతి శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ కొనసాగుతుందని, స్వయంగా భక్తులు పాల్గొని, దీపాలు వెలిగించవచ్చని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు.

నేడు అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్ ప్రారంభం



గుంటూరు మెడికల్: నగర ప్రజలకు అత్యాధునిక కార్పొరేట్ వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక కొత్తపేటలో క్లినిక్ ప్రారంభమవుతోందని చెప్పారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోలవరపు అనురాగ్ ఆధ్వర్యంలో అత్యాధునిక కార్డియాలజీ వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. త్రీడీ క్యాథ్‌ల్యాబ్, హార్ట్ ఫెయిల్యూర్ ఐసీయూ, కరోనరీ కేర్ యూనిట్, కాంప్రహెన్సీవ్ వాస్క్యులర్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. నానాటికి పెరిగిపోతున్న క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు అత్యాధునిక సేవల్ని అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఐరా క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ బైరపనేని స్రవంతి, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మోర్ల అయ్యప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. కీమో థెరపీ, ఇమ్యూనో థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, మ్యామో గ్రామ్, కొలనోస్కోపీ, బ్రాంకోస్కోపీ, బోన్‌మ్యారో బయాప్సి, ఇతర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నగర ప్రజలంతా లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అందిస్తున్న వైద్య సేవల్ని వినియోగించుకోవాలనిఆమె కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పట్నంబజారు: రౌడీషీటర్లంతా సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకపోతే నగర బహిష్కరణ తథ్యమని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ ఎం.డి.మీరజ్ స్పష్టం చేశారు. శనివారం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మీరజ్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీషీటర్లంతా ప్రవర్తన మార్చుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

రీ-సర్వేతో భూ రక్ష

- గ్రామాల్లో చకచకా జరుగుతున్న భూముల రీసర్వే
- ఇప్పటికే గ్రామాల్లో పూర్తయిన డ్రోన్ సర్వే
- 1.40 లక్షల ఎకరాల్లో కొనసాగుతున్న రోవర్ సర్వే
- వంద సంవత్సరాల తర్వాత జరుగుతున్న భూముల రీ-సర్వే



ఈదులపాలెంలో అత్యాధునిక రోవర్‌తో భూముల రీసర్వే చేస్తున్న సర్వేయర్లు

ప్రత్తిపాడు: భూముల రీసర్వే గ్రామాల్లో చకచకా జరుగుతోంది. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష' పథకం కింద మీ భూమి- మా హామీ పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతంగా ప్రవేశపెట్టిన సర్వే పనులు శరవేగంగా సాగుతున్నాయి. వందేళ్ల తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్రోన్స్, కార్స్, రోవర్.. వంటి అత్యాధునిక పరికరాలతో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వేను సర్వే బృందాలు గ్రామాల్లో చేస్తున్నాయి.

సర్వే ఆఫ్ ఇండియా జాతీయ సంస్థ నైపుణ్యం, సహకారంతో ఆధునిక సాంకేతిక రీ-సర్వే మండలంలో మూడు దశల్లో జరగనున్నది. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని కొండజాగర్లమూడి గ్రామాన్ని జిల్లాలోనే తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 296 ఎకరాల్లో దిగ్విజయంగా సర్వే పూర్తి చేశారు. అనంతరం రెండవ దశలో మండలంలోని ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు, యనమదల, ఈదులపాలెం, నడింపాలెం, కొండేపాడు, గనికపూడి రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశారు. వాటిలో కొండేపాడులో ఇప్పటికే సర్వే పూర్తి కాగా, గనికపూడిలో చివరి దశలో ఉంది. కాగా మిగిలిన ఐదు గ్రామాల్లోనూ ప్రత్యేక బృందాలతో సర్వే పనులను వేగవంతం చేశారు. మూడవ దశలో పాతమల్లాయపాలెం, వంగిపురం రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరగనుంది. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల్లోని 47 రెవెన్యూ గ్రామాల్లో, 1.40లక్షల ఎకరాల్లోఈ సర్వే శరవేగంగాజరుగుతోంది.





ప్రత్తిపాడు గ్రామంలో హద్దులకు సర్వే చేస్తున్న సర్వేయర్లు

సర్వే వల్ల ఉపయోగాలు..

- ప్రతి భూభాగానికి ఆధార్ తరహాలో ఒక ల్యాండ్ పార్సిల్ నంబర్ (విశిష్ట గుర్తింపు సంఖ్య)ను ఇస్తారు.
- దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పడుతుంది.
- అస్తవ్యస్తంగా ఉన్న రికార్డుల స్వచ్ఛీకరణ.
- వాస్తవంగా ఉన్న భూముల విస్తీర్ణం ప్రకారం రికార్డుల తయారీ.
- ప్రస్తుతం సర్వే నంబర్ల వారీగా హద్దు రాళ్లు లేకపోవడంతో సరిహద్దు తగాదాలు జరుగుతున్నాయి. రీ సర్వేతో ప్రతి సర్వే నంబరుకు ఉచితంగా సర్వే, వైఎస్సార్ జగనన్న భూ రక్ష హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తారు
- భూ యజమానులకు తమ భూములపై వేరొకరు సవాల్ చేయడానికి వీలులేని శాశ్వత భూ హక్కులు కల్పిస్తారు.
- భూ వివాదాలు తగ్గుముఖం పడతాయి. భవిష్యత్‌లో లావాదేవీలు సులభతరమవుతాయి.

మండలం	సర్వే జరుగుతున్న గ్రామాలు	సర్వే చేస్తున్న ఎకరాలు
ప్రత్తిపాడు	07	21,727
గుంటూరురూరల్	04	10,341
వట్టిచెరుకూరు	13	28,981
పెదనందిపాడు	12	34,896
కాకుమాను	11	44,073
మొత్తం	47	1,40,018

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం



ఒక్కసారి సర్వే పూర్తయితే రైతులు పదే పదే రికార్డుల సవరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం రాదు. భూ కమతాలు, ఆర్ఎస్ఆర్.. వంటి రికార్డులన్నీ పూర్తిగా అప్‌డేట్ అవుతాయి. సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్శిల్ నంబర్ వస్తుంది. స్వచ్ఛీకరించిన నూతన రికార్డుతో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఇప్పటివరకూ ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. సర్వే పూర్తయిన తర్వాత పొలంలో హద్దు రాళ్లు కూడా ప్రభుత్వమే వేయిస్తుంది. గ్రామాలకు వచ్చే సర్వే బందాలకు రైతులు సహకరించాలి.

–ఎం. ప్రభాకర్ రెడ్డి, ఆర్డీవో, గుంటూరు.

బంగారు ఆభరణాల చోరీ..

పెదకాకాని: దొంగలు పడి 11 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. లూథర్‌గిరి కాలనీకి చెందిన గేరా అమల భర్త చెన్నైలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడితో కలసి ఆమె పెదకాకానిలోని పుట్టింటిలోనే ఉంటోంది. ఎప్పటిలానే కింద పోర్షన్‌కు తాళాలు వేసి పై పోర్షన్‌లో వారు నిద్రించారు. ఈ నెల 25న పంచాయతీ కుళాయి ద్వారా నీళ్ల పట్టుకునేందుకు కిందకు దిగి చూడగా ఇంటి మెయిన్ డోర్‌కు ఉన్న తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తాళం తీసి లాకర్ ఉన్న బంగారు గాజులు, బ్రాస్‌లెట్, గ్రీన్ కలర్ గోల్డ్ రింగ్, ప్లెయిన్ రింగ్‌లు, బుట్టలు, తీగల పోగులు, పోగులు, కమ్మలు, మంగళ సూత్రం మొత్తం 11 సవర్ల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1,20,000 ఉంటుందని పేర్కొన్నారు. బంగారు ఆభరనాలు చోరీకి గురి కావడంతో పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం, భుటత వలస గ్రామానికి చెందిన మీసాల జ్యోతి, ప్రసన్నకుమార్ తెనాలిలో ఉంటూ బంగారు పని నేర్చుకుంటున్నారు. ఈ నెల 18న వ్యక్తిగత పనులపై వెళ్లి..తిరిగి తెనాలి వస్తున్న క్రమంలో పెదకాకాని మండలం, వెంకటకృష్ణాపురం సమీపంలో ఆవు అడ్డురావడంతో.. దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. స్థానికులు అతనిని 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఫోన్‌లో ఉన్న సిమ్ ఆధారంగా అతని బంధువులకు సమాచారం తెలిపారు. చికిత్స పొందుతున్న జ్యోతి ప్రసన్నకుమార్(24) పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. మృతుని తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

29న క్రీడాకారులకు, కోచ్‌లకు ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న క్రీడాకారులకు, కోచ్‌లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ ఇంజూరిస్ స్పెషలిస్ట్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి శనివారం తెలిపారు. కొత్తపేటలోని సహస్ర ఆర్థో - న్యూరో సెంటర్ లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాన్ని క్రీడాకారులు, కోచ్‌లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడాకారులకు ఏ చిన్న గాయమైనా అది వారి ఆటతీరుపై ప్రభావితం చూపిస్తుందని, అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఫ్రీ కన్సల్టేషన్ క్యాంపు బ్రోచర్‌ను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి, న్యూరాలజిస్ట్ డాక్టర్ హిమబిందు బొల్లా ఆవిష్కరించారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మన్నవలో గడప గడపకు మన ప్రభుత్వం



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో శనివారం రెండవ రోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందిన సంక్షేమ లబ్ధిని గ్రామస్తులకు వివరిస్తూ, కర పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడారు. గ్రామస్తుల సమస్యలకు.. నిర్ణీత సమయంలో పరిష్కారం కోసం.. సిబ్బందికి మార్గదర్శకాలు ఇచ్చినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు.

దొప్పలపూడిలో డ్రైయిన్ల అభివృద్ధికి శ్రీకారం

పొన్నూరు రూరల్ మండలం దొప్పలపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో వ్యయంతో నిర్మించిన సీసీ డ్రైయిన్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. రూ.5 లక్షలతో డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. బొనిగల నాగమల్లేశ్వరరావు, దొప్పలపూడి గ్రామ సర్పంచ్ కత్రి రమేష్, అన్నవరపు వినోద్ పీటర్, పెరికకృష్ణ మోహన్, భవనం వంశీ రెడ్డి, ఆకుల వెంకటేశ్వర రావు, షేక్ సైపుల్ల, షేక్ మాము, దాసరి నారాయణ రావు, రుద్రపాటి ఆదిశేషు, దేవరకొండ గోపీ, గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంకితభావం, పట్టుదలతో కృషి చేస్తే విజయం సాకారం



ప్రొఫెసర్ ఈశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

గుంటూరు రూరల్: పట్టుదల, అంకిత భావంతో కృషి చేస్తే విజయాలు సులువుగా వరిస్తాయని కర్ణాటక కృపానిధి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఈశ్వర్‌గుప్తా తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సీక్రెట్ ఆఫ్ సక్సెస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయం ప్రతి ఒక్కరి లక్ష్యమని జీవితం సవాళ్లు, అవకాశాలతో నిండి ఉంటుందన్నారు. కష్టపడి పనిచేయాలనే సంకల్పం లేకుండా ఎవరూ విజయాన్ని సాధించలేరన్నారు. విజయాన్ని సాధించాలంటే ముఖ్యమైన విషయం ఓపెన్ మైండ్ కలిగి ఉండాలన్నారు. మూసిన మనసు కలిగినవారు ప్రతి విషయాన్ని అనుమానంతో చూస్తారన్నారు. వారు జీవితంలో ఎదగలేరన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి విజయ లక్ష్యంతో కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి



మదర్ థెరిసా చిత్ర పటానికి నివాళి

పెదకాకాని: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అన్నదానికి ప్రత్యక్ష నిదర్శనం మదర్ థెరిస్సా అని సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా 112వ జయంతి నిర్వహించారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ల శ్యాంముఖర్జీబాబు, విద్యార్థులకు పాల్గొన్నారు.

పర్యావరణంపై ఆర్వీఆర్‌జేసీలో సదస్సు



డాక్టర్ పసుపులేటి సురేష్‌బాబును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని శాస్త్రవేత్త డాక్టర్ పసుపులేటి సురేష్‌బాబు అన్నారు. శనివారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని నివారించేందుకు విద్యార్థులు పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం వాతావరణ కాలుష్యం వల్ల 23 శాతం మంది ప్రజలు వివిధ అనారోగ్య కారణాల వల్ల మత్యువాత పడుతున్నారని తెలిపారు. ఇంధన రహిత వాహనాలను, వ్యర్థాల రీ-సైక్లింగ్‌తో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవి బాధ్యతలు నిర్వర్తిస్తూ, విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇచ్చిన డాక్టర్ సురేష్ బాబు తమ కళాశాల కెమికల్ విభాగ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, కో-ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో నటుడు నవీన్ పొలిశెట్టి సందడి



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న నవీన్ పొలిశెట్టి

పెదకాకాని: సినీ నటుడు నవీన్ పొలిశెట్టి వీవీఐటీ కళాశాలలో శనివారం సందడి చేశారు. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం మిస్ శెట్టి..మిస్టర్ పొలిశెట్టి. సెప్టెంబరు 7న సినిమా విడుదల కానున్న నేపథ్యం ప్రచారంలో భాగంగా నంబూరు వీవీఐటీ కళాశాలను శనివారం చిత్ర బృందం విచ్చేసింది. నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ కృష్ణాష్టమి రోజున సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్‌తో ఆద్యంతం అలరిస్తుందన్నారు. నవీన్ పొలిశెట్టితో విద్యార్థులు కలసి నృత్యాలు చేసి, సెల్ఫీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సలహాదారు రామకృష్ణారెడ్డికి ఘనస్వాగతం

నందివెలుగు సెంటర్‌లో స్వాగతం పలికిన ఎమ్మెల్యే శివకుమార్




సజ్జల రామకృష్ణారెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: పట్టణంలో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శనివారం నందివెలుగు సెంటర్‌లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. పొదినా ఆకులతో తయారు చేసిన భారీ గజమాలను క్రేన్ సహాయంతో సజ్జల రామకృష్ణారెడ్డికి వేశారు. పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు, బొకే, దండలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీతో వెళ్లారు. నందివెలుగు నుంచి తెనాలి వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటిసారిగా రామకృష్ణారెడ్డి తెనాలి రావడంతో నాయకులు, అధిక సంఖ్యలో స్వాగతం పలికేందుకు తరలివచ్చారు. నందివెలుగు జాషువానగర్ వద్ద బెజ్జం బాజి మిత్రమండలి సభ్యులు, కంచర్లపాలెం వద్ద కోపల్లె సురేష్, సోమసుందరపాలెం వద్ద ఎంపీటీసీ సభ్యులు ధర్మరాజుల చెన్నకేశవులు, కఠెవరం వద్ద జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, నాయకులు మైలా భాను ప్రసాద్, సంకురు బుజ్జిబాబు, ఆదం షఫీ తదితరులు రామకృష్ణా రెడ్డికి ఘనస్వాగతం పలికారు. నందివెలుగు వద్ద ఎమ్మెల్యే శివకుమార్‌తో పాటు కౌన్సిలర్ గెద్దేటి సురేంద్ర, బూరెల దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అవుతు సీత నగేష్‌రెడ్డి, బొంతు నరేంద్రరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ప్రసాదం బాలగురవమ్మ, కొలకలూరి నాగేశ్వరరావు, అత్తోట చంటి, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, తాడిబోయిన రామయ్య, అత్తోట చంటి, మేకల రవి, కఠారి హరీష్, మన్నవ ప్రభాకర్, పినపాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్, బొమ్ము నాగిరెడ్డి, సిలార్ జానీ, కుక్కల వాసు, పేరం సంజీవరెడ్డి, కాకి దేవసహాయం, పెసర్లంక రమణ, గుంటూరు కోటేశ్వరరావు, సిరికృష్ణ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తోటకూర వసంతరావు, బొల్లిముంత పోతురాజు, చెక్కా సీతమ్మ, దూళ్ళిపాళ్ళ దుర్గాప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'ఓనం' వేడుకల సందడి



ఓనం వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శనలు



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం ఓనం వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఓనం అతి పెద్ద వ్యవసాయ పండుగని తెలిపారు. సింహ మాసంలో శ్రవణా నక్షత్రం రోజు నుంచి మలయాళీలు 'ఓనం' లేదా 'తిరువోణం' అనే పేరుతో పది రోజుల పాటు పండుగను జరుపుకుంటారని ఆయన వివరించారు. ఇందులో పూలతో ముగ్గులు, సర్పాకారపు పడవ పందేలు, కైకొట్టికలి అనే నృత్యంతో వేడుకగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. వినాయక చవితి పండుగ సమయంలో గణేష్ బొమ్మల్ని ప్రతిష్టించినట్లు ఓనం సమయంలో కేరళ ప్రజలు త్రిక్కకర అప్పన్ (వామనుని రూపంలో ఉన్న విష్ణుమూర్తి)ని వారి ఇళ్లలో ప్రతిష్టిస్తారని చెప్పారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఓనం పండుగలో భాగంగా కేరళలోని దేవాలయాల ఎదుట తాటిచెట్టు చుట్టూ కొయ్య దుంగలను నిలబెట్టి ఎండు తాటి ఆకులతో కప్పుతారని తెలిపారు. త్యాగం చేసి మహాబలి నరకానికి వెళ్లిన దానికి గుర్తుగా ఒక కాగడాతో దాన్ని వెలిగించి బూడిద చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ చాంద్ బాషా మృతి

నెహ్రూనగర్: నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ షేక్ చాంద్ బాషా శనివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అహ్మద్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద భౌతికకాయాన్ని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు సందర్శించి,నివాళులర్పించారు.